అంగవైకల్యం అధిగమించి..





2





2

డబ్బులిస్తేనే సర్వే చేస్తాం



AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in




## పారిశుధ్య పనులను పరిశీలించిన కమిషనర్

**అక్షరటుడే ఆర్మూర్:** ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని వివిధ వార్డులో జరుగుతున్న పారిశుధ్య పనులను గురువారం మున్సిపల్ కమిషనర్ పూజారి శ్రావణి పరిశీలించారు. అదేవిధంగా 10వ వార్డులోని చర్చి కాంపౌండ్‌లో చర్చి పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట ఎన్విరాన్ మెంట్ ఇంజినీర్ పూర్ణమౌళి, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.






## కాంగ్రెస్ పార్టీ అంటేనే అవినీతిమయం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** కాంగ్రెస్ అంటేనే అవినీతి, స్కాంలతో కూడుకున్న పార్టీ అని బీజేపీ జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి విమర్శించారు. ఈ మేరకు బీజేపీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ బీజేపీ కార్యాలయ ముట్టడికి పిలుపునివ్వడంతో.. గురువారం ఉదయమే బీజేపీ నాయకులు పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులను ఆఫీస్ లోపలికి రానివ్వకుండా రోడ్డుపై భైఠాయించారు. అనంతరం విలేకరుల సమావేశంలో దినేష్ మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రజా సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతూ దేశ ప్రజల మన్ననలు చూరగొంటుందన్నారు. అలాంటి బీజేపీని ఏమీ చేయలేక చౌకబారు ఆరోపణలు చేస్తూ కాంగ్రెస్ నాయకులు రోడ్లపైకి వస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో బీజేపీ నాయకులు న్యాలం రాజు, బొట్టు వెంకటేష్, లక్ష్మీనారాయణ, అమంద్ విజయ్, ఆనంద్, పద్మారెడ్డి, పల్నాటి కార్తీక్, కిషోర్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## ధర్పల్లి ఎస్సైగా సామ శ్రీనివాస్



**అక్షరటుడే, ధర్పల్లి:** ధర్పల్లి ఎస్సైగా సామ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే ఎంతటి వారైనా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలు ప్రతిఒక్కరూ పాటించాలని.. బైక్‌లపై వెళ్లే వారు తప్పనిసరిగా హెల్మెట్లు ధరించాలని సూచించారు. సైబర్‌నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితుల్లో డయల్ 100 సేవలను ఉపయోగించుకోవాలని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కాకూడదని సూచించారు.



## సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలి

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** సర్పంచ్‌లు గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. నూతన సర్పంచ్‌లు ఎమ్మెల్యేను గురువారం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారందరిని ఎమ్మెల్యే ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జుక్కల్ నియోజకవర్గ ప్రజలు ఎంతో విశ్వాసంతో సర్పంచ్‌లుగా మిమ్మల్ని గెలిపించుకున్నారని.. వారి నమ్మకాన్ని కాపాడుకోవాలన్నారు. గ్రామాల్లోని ప్రతి సమస్యను ప్రాధాన్యతగా తీసుకువాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి చేరవేయాలన్నారు. ఎమ్మెల్యేగా ఎల్లప్పుడూ మీకు అందుబాటులో ఉంటానని హామీనిచ్చారు.

**గ్రామ పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ విజయబావుటా ఎగుర వేసింది. అత్యధిక స్థానాల్లో గెలుపొంది తనకు ఎదురు లేదని నిరూపించింది. దీంతో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను కైవసం చేసుకునేందుకు అధికార పార్టీ ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇదే జోష్‌లో ప్రత్యర్థి పార్టీల కంటే ముందే బలమైన అభ్యర్థులను వెతికే పనిలో నిమగ్నమైంది. మెజారిటీ ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలను గెలిచి ఎంపీపీ పదవులు, జడ్పీ పీఠాన్ని దక్కించుకునేలా ప్లాన్ చేస్తోంది.**

**- అక్షరటుడే, కామారెడ్డి**



# హస్తంలో నూతనోత్సాహం

- మెజారిటీ సర్పంచ్ స్థానాలను గెలుచుకున్న పార్టీ
- ఇదే ఊపులో ఎంపీటీసీ, జడ్పీటీసీ పోరుపై కన్ను
- ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకుంటున్న అధికార పార్టీ

మూడు విడతల్లో జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు కాంగ్రెస్ మద్దతు దారులు గెలుపొందారు. కామారెడ్డి జిల్లాలో మొత్తం 532 గ్రామ పంచాయతీలలో మూడు దశల్లో ఎన్నికలు జరిగాయి. మొత్తం 352 స్థానాల్లో కాంగ్రెస్ మద్దతు దారులు విజయం సాధించారు. దీంతో జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ గెలుపుతో పార్టీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. ఇదే ఊపులో ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలను సైతం గెలుచుకోవాలని ప్రణాళికలు రచిస్తోంది.

### పోటీనిచ్చిన బీఆర్ఎస్

సర్పంచ్ ఎన్నికల్లో అధికార పార్టీకి బీఆర్ఎస్ గట్టి పోటీనిచ్చింది. అన్ని స్థానాల్లో తన మద్దతుదారులను బరిలో నిలిపింది. మొత్తం 98 చోట్ల విజయం సాధించింది. బీజేపీ మాత్రం ఈ ఎన్నికల్లో ఆశించినంతగా సీట్లు సాధించలేకపోయింది. మొత్తం 31 స్థానాల్లో మాత్రం కమలం మద్దతుదారులు గెలుపొందారు.

### ఎంపీపీలు, జెడ్పీ ఛైర్‌పర్సన్ పదవి కోసం..

జిల్లాలో మొత్తం 25 మండలాలు ఉన్నాయి. మెజారిటీ మండలాల్లో విజయం సాధించి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ పీఠం దక్కించుకోవాలని అధికార పార్టీ యోచిస్తోంది. గతంలో అత్యధిక స్థానాలు గెలిచిన బీఆర్ఎస్ జెడ్పీ పీఠాన్ని కైవసం చేసుకుంది. దీంతో ఈ ఎన్నికల్లో సత్తా చాటాలని అధికార పార్టీ నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. జెడ్పీటీసీ స్థానాల్లో బలమైన అభ్యర్థులను బరిలో దింపేందుకు కసరత్తు చేస్తున్నారు. సర్పంచ్ ఎన్నికల గెలుపుతో జోష్‌లో ఉన్న కాంగ్రెస్ ఇదే ఊపులో మిగతా ఎన్నికల్లో విజయం సాధించాలని భావిస్తోంది. మరోవైపు బీఆర్ఎస్, బీజేపీ కూడా బలమైన అభ్యర్థుల కోసం ఇప్పటి నుంచే కసరత్తు చేస్తున్నాయి. అలాగే ఆయా మండలాల్లో మెజారిటీ ఎంపీటీసీ స్థానాలను గెలుచుకొని ఎంపీపీలను కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది.

### పంచాయతీ పోరు ముగియడంతో

రాష్ట్రంలో పంచాయతీ పోరు ముగియడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలపై ప్రభుత్వం దృష్టి పెట్టనుంది. సమాచారం. రెండేళ్ల కాలంలో తాము చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేయడంలో విజయం సాధించడంలో ప్రజలు తాము మద్దతు తెలిపిన సర్పంచ్ అభ్యర్థులను గెలిపించారని అధికార పార్టీ నేతలు చెబుతున్నారు. ఇదే జోష్‌తో ప్రజల్లోకి వెళ్లి జడ్పీ స్థానాలను కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు పార్టీ గుర్తుతో జరగనుండడంతో రసవత్తరంగా సాగనున్నాయి.

### నిజామాబాద్ జిల్లాలో..

నిజామాబాద్ జిల్లాలో జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు కాంగ్రెస్ మద్దతు దారులు విజయం సాధించారు మొత్తం 545 గ్రామపంచాయతీలో బోధన్ డివిజన్ లో 184 సర్పంచ్ స్థానాలకు గాను.. 29 ఏకగ్రీవమయ్యాయి. నిజామాబాద్ డివిజన్‌లో 196 సర్పంచ్ స్థానాలకు గాను.. 38 జీపీలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే చివరి విడత ఆర్మూర్ డివిజన్‌లో 165 గ్రామపంచాయతీలకు గాను.. 19 స్థానాలకు ఏకగ్రీవమయ్యాయి. మొత్తం 545 గ్రామపంచాయతీలో మూడు విడతల్లో ఏకగ్రీవమైన సర్పంచ్ స్థానాలను కలుపుకొని కాంగ్రెస్ మద్దతు దారులు 351 స్థానాలను గెలుపొందగా.. బీఆర్ఎస్ 79, బీజేపీ 52, ఇతరులు 63 స్థానాలను కైవసం చేసుకున్నాయి.

## నూతన సర్పంచ్‌లను సన్మానించిన మానాల మోహన్ రెడ్డి

**అక్షరటుడే, కమ్మర్‌పల్లి:** పంచాయతీ ఎన్నికల్లో భాగంగా విజయం సాధించిన సర్పంచ్‌లను రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి సన్మానించారు. కమ్మర్‌పల్లి మండలంలోని కోనాపూర్, కోనాపూర్ తండా నుంచి విజయం సాధించిన సర్పంచ్ అరుణ్‌రెడ్డి, సంతోష్‌నాయక్‌లు గురువారం మానాలను కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు. కార్యక్రమంలో ఉదయ్, మహేష్, అనిల్ పాల్గొన్నారు.






## జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి: సీపీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** జాతీయ మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సీపీ సాయి చైతన్య అన్నారు. ఈ మేరకు గురువారం ప్రకటన విడుదల చేశారు. ప్రజల న్యాయ సంబంధిత సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి భారత ప్రభుత్వం నిర్వహిస్తున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈనెల 21న నిర్వహించే జాతీయ మెగా లోక్ అదాలత్‌లో చిన్న కేసులు, ట్రాఫిక్ చలానాలు, మైనర్ క్రిమినల్ కేసులు, సివిల్ తగాదాలు వంటి వాటిని సులభంగా పరిష్కరించుకోవచ్చని సూచించారు. ఇది శాంతియుత పరిష్కార విధానమని, ఇరు పక్షాలు పరస్పర అంగీకారంతో సమస్యలు పరిష్కరించుకునే అవకాశం ఉందని వివరించారు.రాజీ మార్గమే రాజమార్గమని సూచించారు. కావున జాతీయ మెగా లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కలిసి రావాలి



**అక్షరటుడే, ఇందూరు:** ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి టీఎన్జీవోస్‌తో కలిసి రావాలని జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ కోరారు. నీటి పారుదల శాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు స్వామి, సునీత ఆధ్వర్యంలో గురువారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టీఎన్జీవోస్ అధ్యక్షుడు సుమన్ కుమార్ మాట్లాడుతూ నీటిపారుదల శాఖ ఉద్యోగుల ఐక్యత అభినందనీయమన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. కార్యక్రమంలో టీఎన్జీవోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శేఖర్, నీటిపారుదల శాఖ ఉద్యోగుల సంఘం కమిటీ రాష్ట్ర కన్వీనర్ లక్ష్మణరావు, రాష్ట్ర కన్వీనర్ నజీర్ అహ్మద్, టీఎన్జీవో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గైని గంగారం, రాష్ట్ర కార్యదర్శి పోల శ్రీనివాస్ పాల్గొన్నారు.



## చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి: కలెక్టర్

**అక్షరటుడే ఇందూరు:** నగరంలో చెత్త సేకరణ ప్రక్రియను పకడ్బందీగా పర్యవేక్షించాలని కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. రోడ్లపై ఎక్కడపడితే అక్కడ చెత్త పారేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నగరంలోని పలు ప్రాంతాల్లో గురువారం పర్యటించి క్షేత్రస్థాయిలో కొనసాగుతున్న పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. రోడ్లపై చెత్త పారవేస్తే జరిమానాలు విధించబడుతుందనే విషయాన్ని ఫ్లెక్సీలు, బ్యానర్లు, మైకుల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. మురికి కాల్వలను క్రమం తప్పకుండా శుభ్రం చేయిస్తూ ప్రజల ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. రోడ్లకు ఇరువైపులా ఖాళీ స్థలాలను శుభ్రం చేయించి పచ్చదనాన్ని పెంపొందించేలా మొక్కలు నాటాలని చెప్పారు. నగర శివారులోని నాగారం డంపింగ్ యార్డును కలెక్టర్ సందర్శించారు. చెత్తను ఆయా విభాగాల వారీగా వేరుచేస్తూ ఎరువులు, ఇతర అవసరాల వినియోగం కోసం శుద్ధి చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించేలా చర్యలు తీసుకోవాలని.. తద్వారా బయోమైనింగ్ సులభం అవుతుందన్నారు. వ్యర్థాలను శుద్ధి చేస్తూ కంపోస్టు తయారు కోసం ప్రతిపాదించిన మరో రెండు వేస్టేజ్ ప్రాసెసింగ్ యంత్రాలను సత్వరమే తెప్పించాలని కాంట్రాక్టు ఏజెన్సీ ప్రతినిధులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, డిప్యూటీ కమిషనర్ రవిబాబు, ఇన్‌ఛార్జి ఎస్‌హెచ్‌వో సాజిద్ తదితరులు ఉన్నారు.

## బర్త్, డెత్ సర్టిఫికెట్ల కోసం అవస్థలు

**మనిషి పుట్టినా.. మరణించినా ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. నిత్యం పదుల సంఖ్యలో జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం నగరవాసులు కార్పొరేషన్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకుంటారు. అయితే పది రోజులుగా ధ్రువీకరణ పత్రాల కోసం నగరవాసులకు తిప్పలు తప్పడం లేదు. సర్వర్ రావడం లేదని అధికారులు చెప్పడంతో చెప్పులు అరిగేలా తిరగాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెలలో సైతం సుమారు 15 రోజులు సర్వర్ పని చేయలేదు. దీంతో వీటికోసం వచ్చేవారు పడి కాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ఉన్నతాధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని దరఖాస్తుదారులు కోరుతున్నారు. సర్వర్ సమస్యను పరిష్కరించి జనన ధ్రువీకరణ పత్రాలు ఇప్పించాలని వేడుకుంటున్నారు.**

**- అక్షరటుడే, ఇందూరు**







## బీజేపీ కార్యాలయం ముట్టడికి కాంగ్రెస్ యత్నం..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** నేషనల్ హెరాల్డ్ కేసుకు సంబంధించి కాంగ్రెస్ అగ్రనేతలను కేంద్ర ప్రభుత్వం వేధిస్తోందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీజేపీ కార్యాలయాల ముట్టడి చేపట్టారు. ఈ మేరకు నగరంలోని బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కాంగ్రెస్ నాయకులు గురువారం యత్నించారు. డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి, నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బొబ్బిలి రామకృష్ణ ఆధ్వర్యంలో గురువారం ఉదయం బీజేపీ కార్యాలయాన్ని ముట్టడించేందుకు కార్యకర్తలు తరలివెళ్లారు. దీంతో అప్రమత్తమైన పోలీసులు వారికి మధ్యలోనే అడ్డుకున్నారు. అనంతరం వారిని వన్ టౌన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నేతలు మాట్లాడుతూ.. నేషనల్ హెరాల్డ్ కేసులో గత పదేళ్లుగా ఏఐసీసీ అగ్ర నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలను బీజేపీ ప్రభుత్వం వేధిస్తోందన్నారు. ఇటీవల సుప్రీంకోర్టు సోనియా గాంధీ, రాహుల్ గాంధీలపై ఈడీ కేసులను తప్పుబట్టిన నేపథ్యంలో బీజేపీ అరాచకాలను నిలదీసేందుకు తాము ముట్టడి కార్యక్రమం చేపట్టామన్నారు. కార్యక్రమంలో పలువురు సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## ఎల్లారెడ్డిలో భక్తిశ్రద్ధలతో అయ్యప్ప స్వామికి ప్రత్యేక పూజలు



**అక్షరటుడే, ఎల్లారెడ్డి :** మండలంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం గణపతిపూజ, హోమం చేశారు. అలాగే సామూహిక పడిపూజ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారుం. కార్యక్రమంలో ప్రజలందరూ అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## ఆర్టీసీ తీరుకు నిరసనగా ఎన్టీఆర్‌నగర్ కాలనీవాసుల ఆందోళన

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ఆర్టీసీ అధికారుల తీరుకు నిరసనగా పట్టణం లోని ఎన్టీఆర్ నగర్ కాలనీవాసులు ఆందోళన చేపట్టారు. తమ కాలనీకి కనీసం రోడ్డు వదలకుండా ఆర్టీసీ అధికారులు గోడ కట్టేస్తున్నారని నిరసన తెలుపుతూ వారు కాలనీవాసులంతా టెంట్ వేసుకుని ధర్నాకు దిగారు. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ ఆర్మూర్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి వినయ్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్టీసీ అధికారులతో మాట్లాడి 15 రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇవ్వడంతో కాలనీవాసులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో మాక్లూర్ సొసైటీ ఛైర్మన్ అశోక్, పండిత్ పవన్, విజయ్ అగర్వాల్, భూపేందర్ పాల్గొన్నారు.




## వందేళ్ల కమ్యూనిస్ట్ ఉద్యమ స్ఫూర్తి ర్యాలీని సక్సెస్ చేయాలి

**అక్షరటుడే,బోధన్:** పట్టణంలో 20వ తేదీన నిర్వహించనున్న వందేళ్ల కమ్యూనిస్ట్ ఉద్యమ స్ఫూర్తి ర్యాలీని విజయంవంతం చేయాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ బోధన్ డివిజన్ కార్యదర్శి నడ్పి భూమయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని ఎల్‌బీఎస్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దేశంలో కమ్యూనిస్టు పార్టీ ఏర్పడి వందేళ్లు పూర్తవుతున్న సందర్భంగా పట్టణంలో ర్యాలీ చేపట్టనున్నామని తెలిపారు. రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు జేవీ చలపతిరావు పార్టీ జిల్లా కార్యదర్శి ఆకుల పాపన్న తదితరులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో డివిజన్ నాయకులు చిన్నపర్వయ్య, పోశెట్టి, గౌతం కుమార్, నాయకులు సుధాకర్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



## డబ్బులిస్తేనే లెప్రసీ సర్వే చేస్తాం

**అక్షరటుడే, ఇందూరు :** తమకు డబ్బులిస్తామంటేనే లెప్రసీ సర్వే చేస్తామని ఆశా కార్యకర్తలు అన్నారు. ఈ మేరకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఏవోకు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి నూర్జహాన్ మాట్లాడుతూ.. డిసెంబర్ 18వ తేదీ నుంచి సర్వే చేయాలని రాష్ట్ర ప్రభుత్వం ఆశా వర్కర్లకు సూచించిందన్నారు. కానీ అదనంగా ఇచ్చే రుసుముపై అధికారుల నుంచి స్పష్టత లేదన్నారు. దీంతో ఆశా వర్కర్లు నిరాశలో ఉన్నారన్నారు. అలాగే ఏళ్లుగా పనిచేస్తున్న ఆశా కార్యకర్తలకు కనీసవేతనాలు అమలు కావట్లేదని నూర్జహాన్ ఆవేదన వ్యక్తం చేశారు. రూ. 18వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో పెండింగ్‌లో ఉన్న లెప్రసీ సర్వే డబ్బులు సైతం చెల్లించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సుకన్య, రేణుక, గీత, అనిత పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

**అక్షరటుడే, కామారెడ్డి:** గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని రాజంపేట పీహెచ్‌సీ వైద్యురాలు విజయ మహాలక్ష్మి పేర్కొన్నారు. రాజంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం అమ్మఒడి కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని నాలుగు ఉపకేంద్రాల నుంచి గర్భిణులను ఆశాకార్యకర్తలు తీసుకువచ్చి వారికి బ్లడ్ టెస్టులు, ఇతర పరీక్షలు నిర్వహించారు.

**అంగవైకల్యం ఉందని ఏ మాత్రం కుంగిపోలేదు.. ఆత్మస్థైర్యం అందరికంటే ఎక్కువగా ఉందని నిరూపించాడు నగరానికి చెందిన శ్రీనికేష్ కిరణ్. చిన్నతనం నుంచే స్విమ్మింగ్‌లో రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అనేక పతకాలు సాధిస్తున్నాడు. అందరికీ ఆదర్శంగా నిలుస్తూ.. ముందుకు సాగుతున్నాడు.**

– అక్షరటుడే, ఇందూరు



జిల్లాకేంద్రంలోని గౌతమ్ నగర్ కు చెందిన కిరణ్ కుమార్, శ్రీవాణి దంపతుల కుమారుడు శ్రీనికేష్ కిరణ్. రెండు చేతులు లేకుండానే అంగవైకల్యంతో జన్మించాడు. అయితే తండ్రి కిరణ్ కుమార్ బెంగళూరు బీఎస్ఎఫ్‌లో జవాన్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీనికేష్ విద్యాభ్యాసం సైతం బెంగళూరు, ఢిల్లీ, పంజాబ్‌లో కొనసాగింది. అయితే తన ఎనిమిదో ఏట 2015లో తండ్రి కిరణ్ కుమార్, ఆదిత్య మెహతా పారా స్పోర్ట్స్ ఫౌండేషన్ ప్రోత్సాహంతో శ్రీనికేష్ కిరణ్ స్విమ్మింగ్‌లో అడుగు పెట్టాడు. అంచలంచెలుగా ఎదుగుతూ పారా ఏషియన్ గేమ్స్‌లో పలు పతకాలు సాధించాడు.

# అంగవైకల్యం అధిగమించి..

# స్విమ్మర్‌గా రాణించి..

■ జాతీయస్థాయిలో శ్రీనికేష్ కిరణ్ ప్రతిభ.. ■ ఏషియన్ గేమ్స్‌లో పతకాలు..

### శిక్షకుల ప్రోత్సాహంతో..

శ్రీ నికేష్ ప్రతిభను గుర్తించిన తండ్రి కిరణ్ కుమార్ బీఎస్ఎఫ్ ఏఎస్ఐ, స్విమ్మింగ్ కోచ్ సుశీల్ కుమార్ వద్ద తర్ఫీదు ఇప్పించాడు. అంగ వైకల్యం ఉన్నా స్విమ్మింగ్‌లో పూర్తి పట్టు సాధించాడు. పలు విభాగాల్లో రాణిస్తూ ముందుకు సాగాడు. కేవలం ఐదేళ్లలో జాతీయస్థాయిలో అనేక పతకాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచాడు. ప్రస్తుతం బెంగళూరులోని రేవా యూనివర్సిటీలో ఇంటర్మీడియట్ రెండో సంవత్సరం అభ్యసిస్తూ దినేష్ రాజోరియా వద్ద శిక్షణ పొందుతున్నాడు. స్విమ్మింగ్‌లో ఫ్రీ స్టైల్, బ్రెస్ట్ స్ట్రోక్, మిడ్లే విభాగాల్లో ఉత్తమ ప్రతిభ చాటుతున్నాడు.

### సముద్రంలో ఈత

శ్రీనికేష్ కేవలం జాతీయస్థాయి పతకాలు సాధించడమే కాకుండా సముద్రంలోనూ ఈతకొట్టి తన సత్తాచాటాడు.



గుజరాత్‌లోని పోరుబందర్ వద్ద సముద్రంలో 5 కి.మీ.ల స్విమ్మింగ్ పోటీలో 7వ స్థానం పొందాడు. అలాగే అండర్ వాటర్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మధ్యప్రదేశ్‌లోని ఉజ్జయినిలో నిర్వహించిన జాతీయస్థాయి స్విమ్మింగ్ పోటీలో సామాన్యులతో పోటీపడి బంగారు పతకం సాధించాడు. ఇటీవల దుబాయ్‌లో జరిగిన పారా యూత్ ఏషియన్ గేమ్స్‌లో దేశం తరఫున పాల్గొని 50మీ, 100 మీ ఫ్రీ స్టైల్, 100 మీ బ్రెస్ట్ స్ట్రోక్ విభాగాల్లో కాంస్య పతకాలు సాధించాడు.

### దేశానికి పేరు తెస్తా..

అంగవైకల్యం అనేది కేవలం పదం మాత్రమే. కానీ ఆత్మస్థైర్యం అందరికంటే ఎక్కువగా ఉంది. భవిష్యత్తులో అర్జున అవార్డు పొందాలనేదే నా లక్ష్యం. ఆ దిశగా అడుగులు వేస్తున్నాను. మరి నీ పథకాలతో దేశానికి పేరు తెస్తాను. – **శ్రీనికేష్, పారా స్విమ్మర్**

### సాధించిన పతకాలివే..

- 2021లో రాజస్థాన్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలో మూడు రజత పతకాలు.
- 2022లో అస్సాం గుహవాటిలో జరిగిన 22వ జాతీయస్థాయి పారా స్విమ్మింగ్ 50మీ బ్రెస్ట్ స్ట్రోక్, ఫ్రీ స్టైల్ , 400మీ ఫ్రీ స్టైల్‌లో బంగారు పతకాలు.
- 2023 గ్వాలియర్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలో 200 మీటర్ల వ్యక్తిగత మిడ్లే 50 మీటర్ల బ్రెస్ట్ స్ట్రోక్‌లో బంగారు, 100 మీ ఫ్రీ స్టైల్‌లో కాంస్య పతకం.
- 2024లో గోవాలో జరిగిన జాతీయస్థాయి పారా స్విమ్మింగ్‌లో ఫ్రీ స్టైల్, వ్యక్తిగత మిడ్లెలో బంగారు పతకాలు.
- 2025 హైదరాబాద్‌లో జరిగిన జాతీయస్థాయి పోటీలో మూడు బంగారు పతకాలు.

## రేపు ఆర్మూర్‌లో రైతుల ఆత్మీయ సమ్మేళనం

**అక్షరటుడే, ఆర్మూర్:** పట్టణంలోని నటరాజు ఫంక్షన్ హాల్‌లో రైతుల ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు ఆర్ఎస్ఎస్ ఆర్మూర్ సంఘ్ చాలక్ పోల్కం నారాయణ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ శతాబ్ది ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి అఖిలభారత ఆర్ఎస్ఎస్ ప్రతినిధి భాగయ్య హాజరుకానున్నట్లు తెలిపారు.



## సర్పంచ్‌కు సన్మానం

**అక్షరటుడే, పెద్ద కొడప్‌గల్:** మండలంలోని అంజనీ గ్రామ సర్పంచ్‌గా గెలిచిన బీఆర్ఎస్ మద్దతుదారుడు సాయగౌడ్, ఉపసర్పంచ్ దేవిదాస్‌ను మాజీ ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి గురువారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ మద్దతుదారులను గెలిపించిన గ్రామస్థులకు రుణపడి ఉంటామన్నారు. గ్రామస్థుల సహకారంతో సర్పంచ్ పాలకవర్గం అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో నాందేవ్ పటేల్, అంజాగౌడ్, కాశీనాథ్, పవన్ కుమార్ పాల్గొన్నారు.




## క్రీడా దుస్తుల పంపిణీ

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మండలం మగ్గిడి గ్రామస్థులు ఏడుకొండలు, శ్రీనివాస్ కలిసి స్థానిక పాఠశాలలోని బాలబాలికలకు క్రీడాదుస్తులను అందజేశారు. తమ వీటీఆర్ అండ్ వీఎం బీ బ్రిక్స్ తరఫున రూ.25వేల విలువైన 45 క్రీడా దుస్తులను గురువారం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం తిరునగరి హరిత, పీడీ మధుసూదన్, సాయన్న, ధరంపూరి,రాజేశ్వర్, క్రీడాకారులు పాల్గొన్నారు.

## భిక్షాటన చేస్తున్న వ్యక్తిని ఢీకొన్న లారీ.. అక్కడికక్కడే మృతి

**అక్షరటుడే, ఇందల్వాయి:** భిక్షాటన చేస్తున్న ఓ వ్యక్తిని లారీ ఢీకొనగా అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన ఇందల్వాయి టోల్‌ప్లాజ్ వద్ద గురువారం ఉదయం చోటు చేసుకుంది. ఎస్సై సందీప్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మేఘ్యు నాయక్ తండాకు చెందిన లొంబ అనే వ్యక్తి టోల్‌ప్లాజా వద్ద భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అయితే గురువారం ఆయన రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. దీంతో లొంబ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని పంచనామా నిమిత్తం జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్ తెలిపారు.

## అందరి సహకారంతోనే ప్రశాంతంగా ఎన్నికలు పూర్తి

**అక్షరటుడే, ఇందూరు :** అందరి సహకారంతో జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించినట్లు కలెక్టర్ వినయ్ కృష్ణారెడ్డి తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లో గురువారం జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాసరావును, నోడల్ అధికారులను సత్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అధికారులు, సిబ్బంది పరస్పర సమన్వయంతో కృషి చేయడంతో ఎలాంటి తప్పిదాలకు తావు లేకుండా ఎన్నికలు సజావుగా జరిగాయని కలెక్టర్ పేర్కొన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఇదే తరహాలో సమిష్టిగా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నిజామాబాద్ ఆర్డీవో రాజేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.



## జీజీహెచ్‌లో ఎస్‌పీఎఫ్ సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని జీజీహెచ్‌లో ఎస్‌పీఎఫ్ (స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్) సిబ్బందికి సీపీఆర్‌పై అవగాహన కల్పించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ పి.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్, ట్రైనర్ జలగం తిరుపతి రావు సీపీఆర్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. హఠాత్తుగా గుండె ఆగిపోవడం వంటి అత్యవసర పరిస్థితుల్లో సీపీఆర్ ప్రాధాన్యత, ప్రాథమిక జీవన రక్షణ చర్యలు, సమయానికి సరైన విధంగా సీపీఆర్ ద్వారా ప్రాణాలను ఎలా కాపాడవచ్చనే అంశాలను వివరించారు. ప్రాక్టికల్ డెమో ద్వారా ప్రత్యక్షంగా శిక్షణ అందించారు. సిబ్బందికి ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అత్యవసర పరిస్థితుల్లో ధైర్యంగా, సమర్థవంతంగా స్పందించేందుకు ఇది దోహదపడుతుందని



అభిప్రాయపడ్డారు. ఈ శిక్షణ ద్వారా ఎస్‌పీఎఫ్ సిబ్బందిలో ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు, అత్యవసర సందర్భాల్లో ప్రాణరక్షణ చర్యలు చేపట్టే నైపుణ్యం మరింత మెరుగుపడిందని జలగం తిరుపతి రావు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో సాయిరాం, ఎస్‌పీఎఫ్ ఏఎస్సై సురేష్ గౌడ్ పాల్గొన్నారు.

## పీడీఎస్‌యూ మహాసభలను సక్సెస్ చేయాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** వరంగల్ జిల్లాలో జరుగనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహా సభలను విజయవంతం చేయాలని యూనియన్ ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ పిలుపునిచ్చారు. మహాభలకు సంబంధించిన పోస్టర్లను గురువారం జిల్లా కేంద్రంలోని న్యూ అంబేద్కర్ భవన్ ఎదుట ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు నిఖిల్, సిర్రం పవన్ కుమార్, సాయి కిరణ్, ప్రసాద్, రాహుల్, ప్రవీణ్, మస్తాన్, అభినయ్, రాకేష్, కుమార్, అజయ్ పాల్గొన్నారు.



## జాతీయ వాలీబాల్ పోటీలకు మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థిని

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆర్మూర్ మండలం మగ్గిడి పాఠశాల పూర్వ విద్యార్థిని నిషిత జాతీయ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ మధు తెలిపారు. ఈ మేరకు గురువారం వివరాలు వెల్లడించారు. ప్రస్తుతం నిషిత వైజాగ్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా వాలీబాల్ అకాడమీలో శిక్షణ పొందుతోందన్నారు. ఈనెల 16వ తేదీ నుంచి 21వరకు రాజస్థాన్‌లో జరుగుతున్న జూనియర్ వాలీబాల్ ఛాంపియన్‌షిప్‌కు ఎస్ఏఐ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా) టీం తరఫున ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. పంజాబ్‌లోని పటియాలలో జరిగిన శిక్షణ శిబిరంలో అద్భుత ప్రతిభ కనబర్చి జాతీయ జూనియర్ వాలీబాల్ టోర్నీకి నిషిత ఎంపికైందని పీఈటీ మధు తెలిపారు. జాతీయస్థాయి క్రీడలకు ఎంపిక కావడంపై వీఎఫ్ఐ వైస్ ప్రెసిడెంట్ హనుమంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేష్ గౌడ్, ట్రెజరర్ గంగారెడ్డి, జిల్లా యూత్, క్రీడల అధికారి పవన్‌కుమార్, హెచ్ఎం తిరునగరి హరిత, ఉపాధ్యాయులు, మగ్గిడి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

